సాక్షి
నారాయణపేట
గురువారం : 18 : జూలై : 2024



జూరాలలో విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టులోని ఎగువ, దిగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేపట్టారు.

వివరాలు 10లో ▸



వైభవంగా మహాయాగం

నాగర్‌కర్నూల్‌లో విశ్వశాంతి మహాయాగ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /22.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యానగుందికి ప్రత్యేక బస్సులు నడపాలని వినతి



నారాయణపేట రూరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కర్ణాటక రాష్ట్రం యానగుందికి ప్రత్యేక బస్సులు నడిపించాలని సూర్యనంది క్షేత్ర కార్యదర్శి శివయ్యస్వామి కోరారు. ఈ మేరకు ఆ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్టీసీ డీఎం లక్ష్మిసుధకు బుధవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆదివారం మాతా మాణికేశ్వరీ 91వ జయంతి వేడుకలను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయ దర్శనానికి వస్తుంటారని తెలిపారు. ప్రత్యేక పూజలతో పాటు డోళారోహణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తుల సౌకర్యార్థం రెగ్యులర్ సర్వీసులతో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్వేకర్ నికేతన, దశరథ్, దూసాసీతారాములు పాల్గొన్నారు.

20న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

నారాయణపేట రూరల్: బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు శ్యాసన్‌పల్లి రోడ్‌లోని లక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో కొనసాగనుందని అన్నారు. ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు రాష్ట్ర పదాధికారులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, మోర్చాల ప్రతినిధులు విధిగా హాజరుకావాలన్నారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు



మక్తల్: మక్తల్‌లో వినాయక విగ్రహాలు తయారు చేసే షెడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. బుధవారం మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్‌కు చెందిన సతీష్ రెడ్డి వినాయక విగ్రహాల వ్యాపారం చేసుకుంటూ.. జీవనం గడుపుతున్నాడు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వినాయక విగ్రహాల వేలు, తొండం ధ్వంసం చేశారని చెప్పారు. లేనిపోని వాటిని సోషల్ మీడియాలో వదంతులు సృష్టించవద్దని తెలియజేశారు. సతీష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వ్యక్తులను పట్టుకుని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. సతీష్‌రెడ్డి వద్ద పనిచేసే వారు రాజస్థాన్‌కు చెందిన వారని, ప్రస్తుతం వినాయక విగ్రహాలను తయారు చేసే వారు రాయలసీమకు చెందిన వారని అన్నారు. ఎవరైనా మతాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మక్తల సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు షురూ..!

చేపపిల్లల సరఫరాకు నోటిఫికేషన్ విడుదల

- జిల్లాలో 642 చెరువుల్లోకి 1.83 కోట్ల చేపపిల్లల పంపిణీకి శ్రీకారం
- బొచ్చ, రోహు, బంగారు తీగ రకాలు
- 35–40 ఎంఎం 1.02 కోట్లు
- 80–100 ఎంఎం 81 లక్షలు



బంగారు తీగ

నారాయణపేట: రాష్ట్రంలోని మత్స్యకారుల జీవనోపాధి పొందేందుకు వంద శాతం రాయితీపై చేపపిల్లల పంపిణీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లోనే టెండర్ల ప్రక్రియ మొదలై జూలై నుంచి సెప్టెంబర్ వరకు జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని బట్టి చేపపిల్లలు వదిలేవారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడం.. గత ప్రభుత్వ హయాంలో చేపపిల్లల పంపిణీలో అవకతవకలు జరిగాయని బహిరంగంగానే చర్చ కొనసాగింది. దీంతో ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ కొనసాగుతుందో లేదో అనే ఆందోళనలో మత్స్యకారులు ఉండగా.. ఈ నెల 8న కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సీఎం ఆదేశాల మేరకు ఈ నెల 10న చేప పిల్లలను కొనుగోలు చేసి వంద శాతం సబ్సిడీపై మత్స్యకారులకు పంపిణీ చేసేందుకు టెండర్ల నోటిఫికేషన్‌ను రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక జారీ చేసింది.

642 చెరువుల్లోకి..

జిల్లాలో 2 రిజర్వాయర్లు, 642 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 35–40 ఎంఎం లక్ష చేపపిల్లలకు గాను రూ.61,930 విలువతో సరఫరా చేయాల్సి ఉంది. జిల్లాలోని చెరువుల్లో 35–40 ఎంఎం చేపపిల్లలు 1.02 కోట్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 80–100 ఎంఎం చేప పిల్లలను 82 లక్షలు సరఫరా చేసేందుకు లక్షకు రూ.1,61,640 చొప్పున పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకు గాను వ్యాపారస్తులకు టెండర్లను పిలిచారు. చెరువుల్లో చేప పిల్లలను వదలడంతో జిల్లాలో 147 మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని 11,039 సభ్యులకు జీవనోపాధి కలుగుతుంది. అందులో 141 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 10,618 మంది సభ్యులు, 6 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా.. 421 మంది మహిళ సభ్యులు ఉన్నారు.

జిల్లాలో 147 మత్స్యపారిశ్రామిక సంఘాలు
11,039 సభ్యులకు జీవనోపాధి

వ్యాపారస్తులు ముందుకు వస్తారో...లేదో?

చేపపిల్లలను సరఫరా చేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బిడ్ డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 23 వరకు బిడ్‌ను దాఖలు చేయాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారస్తులు ముందుకు వస్తారో లేదో అనే చర్చ కొనసాగుతుంది. గత ప్రభుత్వ హయాంలో చేప పిల్లలను సరఫరా చేసిన వ్యాపారస్తులకు రాష్ట్ర వ్యాప్తంగా డబ్బులు చెల్లించాల్సి ఉందని తెలిస్తోంది. అయినప్పటికీ చేప పిల్లలను సరఫరా చేసేందుకు పాత వారు టెండర్లలో పాల్గొంటారా.. కొత్త వారు ముందుకు వస్తారా అనేది వేచిచూడాలి.

23 వరకు టెండర్లు స్వీకరణ

చేపపిల్లలను సరఫరా చేసేందుకు రాష్ట్ర మత్స్యశాఖ నోటిఫికేషన్‌ను 10న విడుదల చేస్తూ.. 15 నుంచి ఆన్‌లైన్‌లో టెండర్లు వేసుకోవచ్చని సూచించింది. ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటల వరకు చేపపిల్లలను ప్రభుత్వ ధరలకు సరఫరా చేసే వ్యాపారస్తులు టెండర్లు వేసుకోవచ్చని ఆహ్వానించింది. బిడ్ అమౌంట్ రూ.25 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అదే రోజు 3.30 గంటలకు బిడ్‌ను ఓపెన్ చేస్తారు.

టెండర్లు కమిటీ సమక్షంలో..

కలెక్టర్ సిక్తా పట్నాయక్ దిశానిర్దేశంతో జిల్లా మత్స్యశాఖ అధికార యంత్రాంగం చేప పిల్లలను పంపిణీ చేసే టెండర్ల ప్రక్రియ కొనసాగనుంది. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు టెండర్ల కమిటీ చైర్మన్‌గా జిల్లా అడిషనల్ కలెక్టర్, మెంబర్ కం కన్వీనర్‌గా జిల్లా మత్స్యశాఖ అధికారి రాణాప్రతాప్, సభ్యులుగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, ఈడీఎం, ఇరిగేషన్ ఈఈలు ఉంటారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో చేప పిల్లల టెండర్లు, మత్స్యకారులకు పంపిణీ, చెరువుల్లో వదిలేంత వరకు వారి పర్యవేక్షణలో కొనసాగుతుంది.

పారదర్శకంగా చేపల పంపిణీ..



జలాశయాలు, చెరువుల్లో సగానికి పైగా నీరు చేరిన తర్వాత చేప పిల్లలను పంపిణీ చేస్తాం. చేపపిల్లల సరఫరాకు రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాల మేరకు టెండర్లు పిలిచాం. ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు బిడ్‌ను ఓపెన్ చేస్తారు. చేపపిల్లలను సరఫరా చేసే వ్యాపారస్తులు పారదర్శకత పాటించాలి. వ్యాపారస్తులు చేపపిల్లలను సరఫరా చేసేందుకు టెండర్లలో పాల్గొనాలి.

– రాణాప్రతాప్, జిల్లా మత్స్యశాఖ అధికారి, నారాయణపేట

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

నారాయణపేట రూరల్: జిల్లాలో తొలి ఏకాదశిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే తల స్నానాలు ఆచరించి ఉపవాసాలు ఉన్నారు. సాయంత్రం ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. నారాయణపేట శ్రీ రుక్మిణీ సమేత శ్రీపాండురంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మక్తల్‌లో మల్లికార్జునస్వామి, శ్రీడమటి ఆంజనేయస్వామి, నల్లజానమ్మ, ఉమామహేశ్వర, శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పండు ఆరగించి ఉపవాసాలు విడిచారు.



కోటకొండలో ప్రత్యేక అలంకరణలో శ్రీపాండురంగస్వామి



మక్తల్‌లో నల్లజానమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

బహుజన వీరుడు పండగ సాయన్న



హన్వాడ: బహుజన వీరుడు పండగ సాయన్న అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పండగ సాయన్న విగ్రహాన్ని బుధవారం ఆయన ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నీలం మధు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న మన్యంకొండ దేవస్థానం వద్ద పండగ సాయన్న 25 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రభుత్వంతో చర్చించి ఎకరా స్థలంలో పండగ సాయన్న స్మృతీవనం నిర్మిస్తామన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పండుగ సాయన్నకు నిజంగా నివాళులర్పించాలంటే ఆయన చూపిన మార్గంలో మనం నడవాలని పిలుపునిచ్చారు. మనం కూడా ఆయన చూపించిన దారిలో వెళ్లి మనవంతు సహాయంగా పేదలకు సహాయం చేద్దామన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ మన్యంకొండ దగ్గర 25 అడుగుల పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులకు మంత్రి వర్గంలో చోటు కల్పిస్తానని, బీసీ డీ నుంచి ఏలోకి మారుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, ఎస్పీ వెంకటేష్, సంజీవ్ ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయాలి

కృష్ణా: కృష్ణానది ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నా.. దిగువకు చుక్కనీరు కూడా రాకపోవడం తెలంగాణ రైతుల దీనస్థితి కనిపిస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరం వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి నెల రోజులు వరదలు వస్తున్నాయి. నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నా.. ఇక్కడ మాత్రం నదిలో నీళ్లు లేక ఒట్టిపోయి కనిపిస్తుందన్నారు. ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు నదిపై ఎక్కడికక్కడా డ్యాంలు, ప్రాజెక్టులు, బ్రిడ్జికం బ్యారేజీలు నిర్మించిందన్నారు. దీంతో నెల రోజుల నుంచి ఎగువ నుంచి వస్తున్న వరద నీరు కాస్త అక్కడే నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద వర్షాలు కురిసిన సమయంలోనే ఈ పరిస్థితి ఉంటే, వర్షాలు లేని సమయంలో తెలంగాణ రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, పాలకులు నది నీటిపై దృష్టి సారించి రైతులకు మేలు చేయాలని కోరారు.

కృష్ణమ్మ పరుగులు

నేటి రాత్రికి జూరాలకు చేరనున్న వరద నీరు



నెట్టెంపాడు ప్రాజెక్టులోని గుడ్డెందొడ్డి లిఫ్టులో నీటి పంపింగ్

- ఆల్మట్టి నుంచి 65 వేలు.. నారాయణపూర్ నుంచి 37 వేల క్యూసెక్కులు విడుదల
- నెట్టెంపాడు, భీమా కింద మొదలైన పంపింగ్
- మరో మూడు, నాలుగు రోజుల్లో కల్వకుర్తి, కోయిల్‌సాగర్ సైతం
- తుంగభద్ర బేసిన్ పరిధిలోని ఆర్డీఎస్‌కు ఆశాజనకం

గద్వాల రూరల్: ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు పోటెత్తుతోంది. ఇప్పటికే అక్కడి ప్రాజెక్టులైన ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. దీంతో ఆయా ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. గురువారం రాత్రి వరకు వరద నీరు జూరాలకు చేరనుందని పీజేపీ అధికారులు పేర్కొంటున్నారు. వానాకాలం మొదలై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో రైతన్నలు కొంత ఆందోళన చెందారు. అయితే వారం రోజులుగా కృష్ణాబేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండడంతో అడుగంటిపోయిన జలాశయాలు జలకళ సంతరించుకుంటున్నాయి. రాష్ట్రంలోనే కృష్ణాబేసిన్‌లో తొలి ప్రాజెక్టు అయిన జూరాలకు గురువారం రాత్రికి నీరు వచ్చి చేరితే.. ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువనున్న శ్రీశైలానికి విడుదల చేస్తారు.

నీటి పంపింగ్ మొదలు..

ఉమ్మడి జిల్లాలోని నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల కింద నీటి పంపింగ్ మొదలుపెట్టారు. జూరాల హైడల్ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రం ఒక యూనిట్ ప్రారంభమవగా.. మరో మూడు నాలుగు రోజుల్లో కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పంపింగ్ కూడా ప్రారంభించనున్నారు. మరోవైపు మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతుంది. దీంతో ఆల్మట్టి ప్రాజెక్టు అధికారులు 65,000 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు వదలగా.. అక్కడ 12 గేట్లు ఎత్తి దిగువన జూరాలకు 37,260 క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ వరద నీరు గురువారం రాత్రికి జూరాలకు చేరుతుందని అధికారులు తెలిపారు.

⇨ తుంగభద్ర బేసిన్‌లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో హోస్‌పేట్‌లోని తుంగభద్రకు సైతం భారీ వరద వస్తోంది. దీంతో అలంపూర్ నియోకవర్గంలోని 87 వేల ఎకరాల ఆయకట్టున్న ఆర్డీఎస్‌కు వరద వచ్చే అవకాశాలుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తిపోతలకు జలకళ

జూరాల ప్రాజెక్టు ఆధారంగా ఉమ్మడి పాలమూరులో నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతలు నిర్మించారు. ఈ ప్రాజెక్టుల కింద ఏటా ఖరీఫ్‌లో 7 లక్షల ఎకరాల వరకు ఆయకట్టుకు నీరందిస్తున్నారు. ముఖ్యంగా కల్వకుర్తి ఎత్తిపోతలు, శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం ఉన్నప్పుడు బ్యాక్‌వాటర్ నుంచే నీటిని ఎత్తిపోసి దాని కింద 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అలాగే జూరాల ప్రాజెక్టు కింద కుడి ప్రధాన కాల్వ పరిధిలోని జోగుళాంబ గద్వాల జిల్లా, ఎడమ ప్రధాన కాల్వల పరిధిలో మక్తల్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నారు. వీటితోపాటు భీమా ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో 1.50 లక్షల ఎకరాలకు, నెట్టెంపాడు ఎత్తిపోతల కింద 1.42 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఇలా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 7 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందిస్తుండగా ఈ ప్రాజెక్టుల కింద జూలై, ఆగస్టు మాసాల్లో పంటల సాగు పూర్తవుతుంది. ప్రస్తుతం జూరాలకు భారీగా నీరు రానుండటంతో ఇప్పటికే జూరాల కుడి, ఎడమ, సమాంతర ప్రధాన కాల్వలతోపాటు నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల కింద పంపింగ్ మొదలుపెట్టారు. మరో మూడు, నాలుగు రోజుల్లో కోయిల్‌సాగర్, కల్వకుర్తి కింద పంపింగ్ మొదలు పెట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పంటలు సాగుచేసేందుకు అవసరమైన నీరు వచ్చి చేరడంతో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నదీ పరివాహక ప్రాంతాలకు హెచ్చరిక

కృష్ణానదికి వరద ప్రవాహం ఉండడంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లు హెచ్చరికలు జారీ చేశారు. అలాగే జాలర్లు సైతం చేపల వేటకు నదిలోకి వెళ్లరాదని సూచించారు. ఎక్కడా చిన్నపాటి ప్రమాదాలు సంభవించకుండా ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులను అప్రమత్తం చేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వరద తీవ్రతను బట్టి..

నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి దిగువకు 40 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గురువారం రాత్రి వరకు ఈ వరద జలాలు జూరాలకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే జూరాల కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు, నెట్టెంపాడు, భీమాకు నీరు విడుదల చేశాం. వరద తీవ్రతను బట్టి అవసరమైనంత మేర ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తాం.

– జుబేర్, ఈఈ జూరాల డ్యాం

ఆర్టీసీ డిపోలో ఉత్సాహంగా క్రీడాపోటీలు



నారాయణపేట ఆర్టీసీ డిపోలో ఆటాపోటీల్లో పాల్గొన్న డ్రైవర్లు, కండక్టర్లు

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సిబ్బందికి బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఎండీ సజ్జనార్ ఏర్పాటు చేసిన లక్ష్యేలక్ష్యం చాలెంజ్‌లో పాల్గొని డ్రైవర్, కండక్టర్లు డిపోల ఆదాయం పెంచడానికి చేస్తున్న కృషిని గుర్తించి ప్రతి నెల వారిని ఆహ్లాదంగా ఉంచడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జూలై నెలకు గాను క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషులకు పరుగుపందెం, మహిళలకు కుర్చీ ఆట, బుట్టలక్ష బాల్ వేయడం తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి అందించారు. ఈ సందర్భంగా 'లక్ష్యే లక్ష్యం' చాలెంజ్ పేరుతో వేసిన రంగుల ముగ్గు ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఎం లక్ష్మిసుధ, సీఐ అలివేలమ్మ, సూపర్‌వైజర్లు శ్రీశైలమ్మ, భీమమ్మ, ఆంజనేయులు, నరేందర్ పాల్గొన్నారు.



మద్దూరులో అలాయ్ బలాయ్ తీసుకుంటున్న పీర్లు

మత సామరస్యానికి ప్రతీక

దామరగిద్ద: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగ ఉత్సవాలు బుధవారం జిల్లాలోని మండల కేంద్రాలు, వివిధ గ్రామాల్లో నిర్వహించారు. పీర్ల చావిడి నుంచి పీర్లను బయటకు తీసి యాటలు బలిఇచ్చారు. అంతకు ముందు మాలీజా, పానియం వీధుల్లో పంపిణీ చేశారు. ఆ తర్వాత పరుషులు అలాయ్.. బలాయ్ ఆడారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. వీటిని భక్తులు ఆసక్తిగా తిలకించారు. దప్పులు వాయిస్తుండగా.. పీర్లు సవారీ నిండుతూ గ్రామంలో తిరిగాయి. అనంతరం గ్రామ చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



ధన్వాడలో హసన్ హుసెన్ పీర్ల వద్ద అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

తొలి ఏకాదశి వేడుకలు

- జనసంద్రమైన మన్యంకొండ
- వైభవంగా శేషవాహన సేవ


మన్యంకొండలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం బుధవారం జనసంద్రమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారోత్సవం, శేషవాహన సేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి ఆలయం ముందున్న సభా మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మేళతాళాలు, అర్చకుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ నడుమ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం హనుమద్దాసుల మండపం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి కోనేరు నుంచి గర్భగుడి వరకు బారులు తీరారు. అలాగే దేవస్థానం పక్కనున్న శివాలయంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కొండ దిగువనున్న అలివేలు మంగ తాయారు దేవస్థానంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి పాల్గొన్నారు.

భక్తజన సంద్రమైన నల్లమల ఆలయాలు..


ఉమా మహేశ్వరంలో భక్తుల రద్దీ


ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: నల్లమలలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం, లొద్ది మల్లయ్య, అంతరగంగ ఆలయాలకు భక్తులు పోటెత్తాయి. అచ్చంపేట మండలం పలకపల్లి రామలింగేశ్వర ఆలయం, పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ దంపతులు పలకపల్లి భవాని రామలింగేశ్వర, ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. లొద్ది మల్లయ్య క్షేత్రానికి అటవీశాఖ అనుమతి లేదని చెప్పినా.. భక్తులు తరలిరావడంతో అడవిలోకి అనుమతించారు. కాలినడకన ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉమామహేశ్వరంలో భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు.

కురుమూర్తిలో లక్ష పుష్పార్చన..

చిన్నచింతకుంట: తొలి ఏకాదశిని పురస్కరించుకొని కురుమూర్తిస్వామి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేదమంత్రోచ్చారణ నడుమ పుష్పార్చన చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి పూజ ల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, పూజా రులు వెంకటయ్య, విజయ, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.


లక్ష పుష్పార్చన నిర్వహించిన అర్చకులు

సోమేశ్వరాయంలో భక్తుల పూజలు..


కృష్ణానది ఒడ్డున భక్తులు

కొల్లాపూర్ రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా సోమశిలకు భక్తులు పోటెత్తారు. కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నది ఒడ్డున ఉన్న సోమేశ్వరాలయంలో లలితాంబిక, సోమేశ్వరుడిని, ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొల్లాపూర్ ఆర్టీసీ అధికారులు సోమశిలకు ప్రత్యేక బస్సులు నడిపారు. నది అవతలి ఒడ్డున ఉన్న సంగమేశ్వరుడిని దర్శించుకునేందుకు జాలర్లు పుట్టీలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా అమరగిరి సమీపంలో ఉన్న మల్లయ్య ఆలయానికి కొల్లాపూర్ నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చారు.

లొద్ది మల్లయ్య దర్శనానికి..

మన్ననూర్: నల్లమలలో కొలువైన లొద్ది మల్లయ్య దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అటవీ మార్గంలో కాలినడకన చేరుకొని జలపాతం వద్ద పవిత్ర స్నానాలు ఆచరించి కొండ గుహల్లో కొలువైన శివయ్యను దర్శించుకున్నారు. భక్తుల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న తర్వాతే అడవిలోకి అనుమతించారు.


నల్లమలలోని లొద్ది మల్లయ్యను దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి


ఉప్పరి హనుమంతు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన ఉప్పరి హనుమంతు(70)కు కొంత కాలంగా మతిస్థిమితం సక్రమంగా లేదు. ఖాళీ సీసాలు ఏరుకోవడం కోసం చుట్టు పక్కల గ్రామాలకు తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 14న ఇంటి నుంచి ఖాళీ సీసాలు ఏరుకోవడం కోసం వెళ్లి కొండేరు సమీపంలోని కొట్టం కాలేజీ వెనుకాల ఉన్న ఓ వ్యవసాయ బావిలో పడి మృతిచెందినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ఉప్పరి పరశురాముడు ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మృతదేహం గద్వాలలో లభ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల మండలంలోని జమిచెడ్ వాటర్ ఫిల్టర్(నీటి శుద్ధి స్థలం) వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు(65) మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలం వద్దకు చేరుకుని పోలీసులు ఆరా తీశారు. మృతిచెందిన వృద్ధుడు భిక్షాటన చేస్తూ.. జీవనం సాగిస్తున్న వ్యక్తిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సులో నగదు చోరీపై పోలీసుల దర్యాప్తు

- సీసీ పుటేజీల పరిశీలన

జడ్చర్ల: జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో మంగళవారం కర్నూల్ వెళ్తున్న టీఎస్ఆర్టీసీ బస్సులో రూ.36 లక్షల నగదు చోరీ సంఘటనపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. బాధితుడు ట్రాన్స్‌కో ఉన్నత అధికారి దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వెనువెంటనే రంగంలోకి దిగారు. స్థానిక సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో నగదును అపహరించిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆర్టీసీ బస్సులో సీసీ కెమెరాలు ఉండటంతో అందులోని డీవీఆర్‌ను స్వాధీన పర్చుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. అందులో ఎలాంటి సమాచారం నమోదు కాకపోవడంతో ఆందోళనకు గురిచేసింది. బస్సులో ఆ సమయంలో సీసీ కెమెరాల స్విచ్ ఆఫ్‌గా ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత కొత్త బస్టాండ్‌లో, ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి ప్రాథమిక సాక్ష్యాధారాలను పరిశీలించారు. కొత్త బస్టాండ్‌కు ముందే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నగదును అపహరించిన ఇద్దరు బస్ నుంచి కిందకు దిగినట్లు పోలీసులు గుర్తించారు. తలకు టోపీలు పెట్టుకుని సీసీ కెమెరాల్లో మొఖాలు కనిపించకుండా జాగ్రత్తలు పడినట్లు తెలిసింది. అయితే వారు బస్సు దిగిన వెంటనే బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. హైదరాబాద్‌కు వెళ్తున్న కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుపడటంతో వారు బస్సు ఆపి ఎక్కినట్లుగా సమాచారం. ఆ బస్సులో వారు హైదరాబాద్‌కు వెళ్లారా, మధ్యలోనే దిగి మరేదయిన కారులో వెళ్లారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కాగా బాధితుడు దామోదర్‌ను హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచే నిందితులు అనుసరించినట్లుగా అనుమానిస్తున్నారు. ఎంజీబీఎస్‌లో బ్యాగు ఆనవాళ్లను పసిగట్టిన నిందితులు బాధితుడిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ముందుకు సాగారు. నిందితులకు సహకరించేలా అన్నట్లు నగదు కలిగిన బ్యాగును సామాన్లు పెట్టే క్యాబిన్‌లో పెట్టడం, అక్కడ వాటర్‌బాటిళ్లు ఉండటం, మధ్యలో బాధితుడు కునుకుపాటుకు గురికావడం వంటివి కలిసి వచ్చాయి. ఎంజీబీఎస్‌లో బస్సు బయలుదేరే సమయానికి ముందు సంబంధిత ప్లాట్‌ఫాం, తదితర ప్రదేశాల్లోనూ తచ్చాడిన నిందితుల ఆనవాళ్లను అక్కడి సీసీ పుటేజీల్లో పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఇలాంటి చోరీలకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలు, ఆయా కేసుల విచారణలపై పోలీసులు అధ్యయనం చేస్తూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. కాగా ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులో ఇంత పెద్దమొత్తంలో నగదు అపహరణకు గురికావడం మొదటిసారిగా పేర్కొనవచ్చు. కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతుందని ఈ సందర్భంగా పోలీసులు తెలియజేశారు.


రూ.36 లక్షలు చోరీ జరిగిన బ్యాగును పరిశీలిస్తున్న సీఐ ఆదిరెడ్డి(ఫైల్)

భూ వివాదంలో పరస్పర దాడులు

బిజినేపల్లి: భూవివాదం నేపథ్యంలో దాయాదులు ఒకరిపై ఒకరు పరస్పర దాడుదలకు పాల్పడిన ఘటన మండలంలోని నందివడ్డెమాన్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. నందివడ్డెమాన్ గ్రామం నుంచి సల్కర్‌పేట వెళ్లే మార్గంలో 38 గుంటల భూమి ఉంది. ఈ భూమి విషయంలో దాయాదులైన అశోక్, బాలయ్య మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. భూమిలో భాగ పరిష్కారాల విషయమై కోర్టులో కేసు వేశారు. కాగా బుధవారం అశోక్ సదరు పొలంలో దుక్కి దున్ని విత్తనాలు వెయ్యడానికి వెళ్లగా.. విషయం తెలుసుకున్న బాలయ్య, కొందరు వ్యక్తులతో కలిసి అశోక్, అతని భార్య, పిల్లలపై దాడి చేశారు. ఈక్రమంలో ఒకరిపై ఒకరు కర్రలతో పరస్పర దాడికి పాల్పడ్డారు. అనంతరం అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ నాగశేఖరరెడ్డి ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


కర్రలతో దాడి చేసుకుంటున్న దాయాదులు

కోయిల్‌కొండ.. కిటకిట


కోయిల్‌కొండలో బీబీ ఫాతిమా సవారీ


ఊట్కూర్‌లో దోలారోహణ కార్యక్రమానికి హాజరైన భక్తులు

కోయిల్‌కొండ: మొహర్రం పండుగను పురస్కరించుకొని కోయిల్‌కొండ ఖిల్లా కోటపై కొలువుదీరిన బీబీ ఫాతిమాను వేలాది భక్తులు దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున గ్రామ పెద్దలు, అధికారులు భాజాభజంత్రీలు, కాగడాలతో ఖిల్లా కోటపైకి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆఖరి ఘట్టంగా ఉత్సవ నిర్వాహకులు బీబీ ఫాతిమాకు గంధంపూసి, ఆశన్న, ఊశన్న పీర్లతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అంతకుముందు అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గండెల్ సాబ్, బీబీ ఫాతిమా కలయిక అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు కోటపై నుంచి పీర్ల సవారీ ప్రారంభమైంది. గ్రామంలోని వివిధ కాలనీల్లో ప్రతిష్ఠించిన పీర్లు సైతం బీబీ ఫాతిమాను అనుకరించాయి. ప్రధాన వీధుల్లో మహిళలు బొడ్డెమ్మ, యువకులు అలాయ్ ఆడారు. ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


బీబీ ఫాతిమా ఆలం, ఇమామే హసన్ ఆలంల ఊరేగింపు

వైభవంగా ఇమామే హుస్సేన్ సవారీ

అమరచింత: పట్టణంలో అల్విదాషా అల్విదాషా హై ఇమామే హుస్సేన్ నామస్మరణ మార్మోగింది. 10 రోజులపాటు పీర్ల చావిడిల్లో కొలువుదీరిన ఆలంలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. అమరచింతలో ఇమామే హుస్సేన్ ఆలం సవారీ మంగళ, బుధవారం రెండు రోజులపాటు కొనసాగింది. మంగళవారం రాత్రి ఇమామే హుస్సేన్ సవారీకి వేలాది మంది దివిటీలను చేపట్టి ఆలంకు వెలుతురు ఇస్తూ, మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఇమామే హుస్సేన్ ఆలం నిమజ్జనోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పట్టణ రహదారులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. ఇమామే హుస్సేన్ ఆలంను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ తదితరులు దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆత్మకూర్ సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


అమరచింతలో ఇమామే హుస్సేన్ ఆలం సవారీ

హసనుసేన్‌కీ దోస్తరాద్దీన్


ఊట్కూర్‌లో హసన్, హుసేన్ పీర్ల సవారీ

ఊట్కూర్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను బుధవారం ఊట్కూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దపీర్ల మసీదులో పదిరోజుల క్రితం ప్రతిష్ఠించిన హసన్, హుసేన్ పీర్లను నవమి సవారీ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పెద్దపీర్ల మసీదుకు పీర్లు చేరుకున్నాయి. దశమి సవారీని పురస్కరించుకొని సాయంత్రం 6 గంటలకు పెద్దపీర్ల మసీదు నుంచి పీర్ల సవారీ ప్రారంభమైంది. డప్పుల మోతల మధ్య పీర్ల సవారీ నేత్రపరంగా సాగింది. ప్రధాన కూడళ్లలో మహిళలు బొడ్డెమ్మ ఆడగా.. యువకులు అలాయ్ ఆడారు. భక్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు కందూర్లు చేశారు. సమీప గ్రామాలతో పాటు హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామ పురవీధులు కిటకిటలాడాయి. గ్రామంలో ఊరేగింపు అనంతరం నిమజ్జనానికి పీర్లు బయల్దేరాయి. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కనులపండువగా దోలారోహణం..

మొహర్రం వేడుకల్లో భాగంగా దేవీనగర్‌లో అనాదిగా వస్తున్న దోలారోహణ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఊయ్యాలలో ఆరెకటిక కులానికి చెందిన మగ శిశువును వేయగా.. హసన్–హుసేన్ పీర్లు ఊయ్యాలను ఊపి బాలుడికి నామకరణం చేశాయి. ఈ వేడుకను తిలకించేందుకు వేలాది భక్తులు తరలివచ్చారు. అలాగే పగిడిమారిలో మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. మొహర్రం వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ లింగయ్య పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దపీర్ల మసీదు, చౌరస్తాలలో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టారు.

మా ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి



సాక్షి, నాగర్‌కర్నూల్/వెల్దండ: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ మల్లు రవి.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూర్‌లో సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమ ఏర్పాటుకు 100 ఎకరాలను గుర్తించినట్లు, పరిశ్రమ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. అదే విధంగా వంగూర్ మండలం సర్వారెడ్డిపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం 1000 ఎకరాల స్థలం గుర్తించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని హైదరాబాద్–బెంగుళూర్ రహదారిని జాతీయ ఇండస్ట్రీయల్ కారిడార్ రహదారిగా గుర్తించాలని, రహదారికి ఇరువైపులా కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్ మండలంలోని కంబలాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం 600ఎకరాల స్థలం గుర్తించామని, వనపర్తి జిల్లాలో ఐటి పార్కు కోసం రూ.22కోట్లు అవసరం ఉన్నట్లు మంత్రికి వివరించారు. అలాగే, హైదరాబాద్–ఎయిర్‌పోర్టు– ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేసే శార్దు ఇండియా పెట్టుబడులను నాగర్‌కర్నూల్ జిల్లాకు విస్తరింపజేయాలని కోరారు. ఎంపీ మల్లురవి కోరిన వివరాలకు మంత్రి సానుకులంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

భూమి అమ్ముకుంటాడన్న అనుమానంతో..

- కొడుకు, కోడలితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: మద్యానికి బానిసైన భర్త ఉన్న భూమిని అమ్ముకుంటాడన్న అనుమానంతో కొడుకు, కోడలితో కలిసి భార్య హతమార్చింది. ఆపై తమకేమీ తెలియనట్టు నటించి తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసులకు పట్టుబడి కటకటలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ వెల్లడించారు. వివరాలిలా.. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన కోమరి నర్సింహులు (54) తన భార్యాపిల్లలతో కలిసి ఏడేళ్లుగా పెబ్బేరు పట్టణంలోని వినాయక నగర్‌లో నివాసముంటున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన అతడు.. కుటుంబ సభ్యులను పట్టించుకోకుండా తిరిగేవాడు. దీంతో ఉన్న భూమిని అమ్ముకుంటాడన్న అనుమానంతో భార్య గోవిందమ్మ, కుమారుడు శివకుమార్, కోడలు సుహాసిని ముగ్గురు కలిసి ఈనెల 12న నర్సింహులుపై గొడ్డలితో విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. అనంతరం అతడిని ఇంట్లోనే వదిలేసి, హైదరాబాద్ వెళ్లిపోయారు. అయితే ఇంట్లో మంచంపై రక్తపు గాయాలతో పడి ఉన్న అతడిని గుర్తించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అదే రోజు సాయంత్రం మృతుడి కుటుంబ సభ్యులతో పాటు సోదరుడి కుమారుడు కోమరి ప్రమోద్‌కుమార్ ఇంటికి చేరుకున్నారు. నర్సింహులు అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు 13వ తేదీన అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడి భార్య, కుమారుడు, కోడలిని తమదైన శైలిలో విచారించడంతో నేరం ఒప్పుకున్నారు. బుధవారం ముగ్గురిని అరెస్టుచేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: మండలంలోని హాజీపూర్ సమీపంలో శ్రీశైలం– హైద్రాబాద్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి (55) మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. హాజీపూర్ సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అచ్చంపేట మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, మృతుడు ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా పలువురు పేర్కొంటున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


దుద్దు ముత్యాలమ్మ (ఫైల్)

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూరుకి చెందిన శతాధిక వృద్ధురాలు దుద్దు ముత్యాలమ్మ(103) మృతిచెందింది. కొన్ని రోజులుగా వయో వృద్ధ భారంతో పాటూ అనారోగ్యం కారణాలతో మంచానికే పరిమితమైన ఆమె బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. గ్రామంలో అతిపెద్ద వయస్సు కలిగిన వ్యక్తిగా గుర్తించిన ఆమెను చూసేందుకు గ్రామంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు బారులు తీరారు. ఇంత వయస్సు వరకు బతకడం అదృష్టం అంటూ కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె మృతిపై పలువురు నివాళి అర్పించారు.

యువకుడి బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని లింగసానిపల్లికి చెందిన సురేష్ (26) బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సురేష్ కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడని.. బుధవారం ఉదయమే తాగి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించగా క్షణికావేశంలో ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. సురేష్‌కు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

బిజినేపల్లి: మండలంలోని ఖానాపూర్‌కు చెందిన చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగమ్మ (52) ఈ నెల 7న భర్తతో గొడవపడి పురుగు మందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.



అదనపు డాక్యుమెంట్లు సమర్పించండి: హైకోర్టు

కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు రద్దు కోరుతూ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు ప్రభుత్వం చేసిన భూమి కేటాయింపును రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో అదనపు డాక్యుమెంట్లు సమర్పించాలని హైకోర్టు పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కోసం బీఆర్‌ఎస్‌కు 2023లో ప్రభుత్వం 11 ఎకరాలను కేటాయించింది. దీని కోసం బీఆర్‌ఎస్ ఎకరాకు రూ.3.41 కోట్లు చెల్లించింది. అయితే కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు కేటాయించిన భూమి తమదేనంటూ సికింద్రాబాద్‌కు చెందిన అశోక్ దత్ జైశ్రీతోపాటు అతని కుటుంబసభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్‌ఏ, హెచ్ఎండీఏ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, గండి పేట్ తహసీల్దార్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీని ప్రతి వాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున వి.మురళీమనోహర్ వాదనలు వినిపిస్తూ.. కోకా పేట్‌లోని ఆ భూమిని పిటిషనర్లు వారసత్వంగా పొందారన్నారు. వారి పూర్వీకులు కూడా ఆ భూమిని చట్టప్రకారం హక్కుదారుల వద్ద కొనుగోలు చేశారని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు చట్టవిరుద్ధమని.. ఆ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భూ హక్కులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అదనపు డాక్యుమెంట్లు సమర్పించాలని ఆదేశించారు.

శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరుగులు

- నారాయణపూర్ డ్యామ్ 9 గేట్లు ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటి విడుదల
- నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి వరదనీరు చేరే అవకాశం
- ఆల్మట్టిలోకి నిలకడగా వరద ప్రవాహం
- తుంగభద్రలో పెరిగిన వరద


భద్రాచలం వద్ద జలకళ సంతరించుకున్న గోదావరి


తాలిపేరు ప్రాజెక్టు నుంచి భారీగా విడుదలవుతున్న వరదనీరు

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది వరద ఉధృతికి కర్ణాటకలోని నారాయణపూర్ డ్యామ్‌లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో ఆ రాష్ట్ర అధికారులు బుధవారం డ్యామ్ గేట్లు 9 ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తూ వస్తోంది. జూరాల ప్రాజెక్టులో నీటినిల్వ ఇప్పటికే 7.66 టీఎంసీలు ఉన్న నేపథ్యంలో..ఒక్క రోజులోనే ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. ఆ తర్వాత జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటికి విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద చేరే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధానపాయ, ఉపనదుల్లో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 92,836 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరింది. దీంతో ఆ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఆ జలాలు నారాయణపూర్ డ్యామ్‌లోకి చేరుతున్నాయి. కృష్ణా ప్రధానపాయలో వరద మరో నాలుగైదు రోజులు ఇదే రీతిలో కొనసాగే అవకాశముందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 49,522 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 39.72 మీటర్లకు చేరుకుంది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 4.5 టీఎంసీలు.. తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని కేటాయిస్తూ మంగళవారం కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సాగర్‌లో నీటిమట్టం కనీస స్థాయికి దిగువన ఉన్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 5.705 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం ద్వారా ఏపీ 15,800, ఎడమ కేంద్రం ద్వారా తెలంగాణ 6,357 వెరసి 22,157 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో నీటినిల్వ 33.24 టీఎంసీలకు తగ్గింది. సాగర్‌లోకి 21,481 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 122.69 టీఎంసీలకు చేరుకుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బుధవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వ ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1699.67	102.53	92,736	65,000
నారాయణపూర్	1615	37.64	1611.75	33.21	51,250	37,260
ఉజ్జయిని	1630	117.64	1603.25	48.85	20,980	200
జూరాల	1045	9.66	1041.7	7.66	2,500	2,720
తుంగభద్ర	1633	105.79	1611.07	39.72	49,522	393
శ్రీశైలం	885	215.81	808.20	33.24	-	22,189
నాగార్జునసాగర్	590	312.05	504	122.69	21,481	6,398
పులిచింతల	175	45.77	99.41	0.72	154	50
ప్రకాశం బ్యారేజీ	57.05	57.05	3.07	3.07	8,193	8,193

వరద గోదావరి

భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 21 అడుగులకు చేరే అవకాశం

భద్రాచలం అర్బన్: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. భద్రాచలం వద్ద ఈ నెల 13వ తేదీ నుంచి 13 అడుగుల మేర నీటిమట్టం నిలకడగా ఉంది. రెండు,మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద వచ్చి చేరుతుండడంతో మంగళవారం రాత్రి 14.5 అడుగులకు చేరింది. ఆపై అంతకంతకూ పెరుగుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా 18.1 అడుగులకు చేరుకుంది. కాగా, బుధవారం రాత్రి మరో మూడు అడుగుల మేర పెరిగి 21 అడుగులకు చేరే అవకాశముందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు నదిలోకి దిగొద్దని హెచ్చరిస్తున్నారు.

'తాలిపేరు'కు పోటెత్తుతున్న వరద

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బుధవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లు అడుగు మేర ఎత్తి 16,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అయినా వరద ఉధృతి ఆగలేదు. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు 22 గేట్లు అడుగు మేర ఎత్తి ద్వారా 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి వరద మరింతగా పెరగగా, 20 గేట్లను రెండేసి అడుగుల మేర, మిగతా ఐదు గేట్లను పూర్తిగా ఎత్తి 70,750 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు.



బిడ్డా.. లే!

అమ్మ ఎవరికైనా అమ్మే. వాహనం ఢీకొని కాళ్లు విరిగిన కోడెదూడ స్థితిని చూసి ఒక ఆవు తల్లడిల్లి పోయింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కోడెదూడకు రెండు కాళ్లు విరిగాయి. లేవలేని స్థితిలో ఉన్న ఆ దూడ పరిస్థితిని గమనించిన తల్లి ఆవు కొమ్ములతో బిడ్డను లేపే ప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియజేయడంతో సిబ్బంది వచ్చి.. కోడె దూడను యజమానికి అప్పగించి రక్తం గడ్డ కట్టిన ప్రదేశాన్ని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు.

– హుజూర్‌నగర్



గుండి వాగుతో గండం

కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫా బాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న గుండివాసులకు ఏటా వాగు కష్టాలు తప్పడం లేదు. 2006లో ప్రారంభించిన వంతెన పనులు నిలిచిపోయాయి. కుమురంభీం ప్రాజెక్టు నుంచి బుధవారం నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేయడంతో.. గుండి వాగులో వరద పెరిగింది. దీంతో జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు దాదాపు 30 కిలోమీటర్లు తిరిగి ఆసిఫాబాద్‌కు చేరుకోవలసి వస్తోంది. కొందరు మాత్రం వాగు నీటిని ప్రమాదకరంగా దాటుతున్నారు. వరద మరింత పెరిగితే తెప్పలపై ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో వాగులో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు.. తొలకరి వర్షాలకే కొట్టుకుపోవడం గమనార్హం.

–ఆసిఫాబాద్ రూరల్

నేడు శ్రీవారి అక్టోబర్ నెల ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు, తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. కాగా, అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు సుప్రభాత సేవ మినహా, మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. అక్టోబర్ 11, 12వ తేదీల్లో సుప్రభాత సేవతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దయ్యాయి. అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు అంగప్రదక్షిణ, వర్చువల్ సేవా దర్శనం టికెట్లను రద్దు చేశారు.

మెసేజ్‌పై క్లిక్ చేస్తే ఖాతాలో రూ.1.50 లక్షలు మాయం



బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన యూబీఐ బ్యాంకుకు చెందిన ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకుడు మునిస్వామి ఖాతా నుంచి రూ.1.50 లక్షలు మాయం అయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. మునిస్వామి ఖాతాదారులకు చెల్లింపులు చేస్తున్న సమయంలో గుర్తు తెలియని నెంబర్ నుంచి ఒక మెసేజ్ వచ్చింది. దానిపై క్లిక్ చేశాడు. తర్వాత ఖాతా నుంచి రూ.1.50 లక్షలు మాయం అయ్యాయి. దీంతో అయోమయానికి గురైన మునిస్వామి బ్యాంకులో తన ఖాతా నుంచి మాయం అయిన డబ్బులపై విచారించగా.. తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎస్‌ఐ దానిపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలియజేశారు.

ఇడ్లీ సాంబార్‌లో పురుగు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఇడ్లీ సాంబార్ తీసుకున్న కస్టమర్‌కు సాంబార్‌లో పురుగు దర్శనమిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జనరల్ ఆస్పత్రి సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం ఉదయం జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి కోసం సాంబార్ ఇడ్లీ పార్సిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత తినడానికి సాంబార్ ఓపెన్ చేయగా.. అందులో పురుగు ఉందని గుర్తించి.. తిరిగి హోటల్ వద్దకు చేరుకుని యాజమానిని ప్రశ్నించాడు. ఇటీవల పట్టణంలో ఇలాంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఆహార భద్రత అధికారులు వరుసగా తనిఖీలు చేసి, మళ్లీ వదిలేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. పట్టణంలోని చాలా వరకు హోటల్స్‌లో వంట గదులు పరిశుభ్రంగా ఉండటం లేదని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కల్లు పోయలేదని వ్యక్తిపై దాడి

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురానికి చెందిన మల్లికార్జున గౌడ్‌కు కల్లు దుకాణం ఉంది. అందులోకి అదే గ్రామానికి చెందిన చెట్టుకింది జయిరాం వచ్చి కల్లు అడిగాడు. కల్లు పోసి డబ్బులు అప్పుగా రాసుకో అన్నాడు. అప్పులేదు.. డబ్బులు ఇవ్వాల్సిందే అని మల్లికార్జున గౌడ్ తెలియజేయడంతో రాయితో జయిరాం దాడి చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై మల్లికార్జున్ గౌడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసినట్లు తెలియజేశాడు. కల్లు ఇవ్వకపోవడంతోనే దాడి చేశాడని వివరించాడు.

ఆల్మట్టికి 81 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

- జూరాల జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ప్రారంభమైన విద్యుదుత్పత్తి

ధరూర్/ మదనాపురం/ దోమలపెంట/ ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టికి వరద జలాలు వస్తున్నాయి. అయితే మంగళవారం ప్రాజెక్టుకు 1.27 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. బుధవారం రాత్రి 8.30 గంటల వరకు ప్రాజెక్టుకు స్వల్పంగా తగ్గి 81,333 క్యూసెక్కులకు చేరుకుంది. దీంతో ఆల్మట్టి నుంచి 65 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 99.317 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 48,700 క్యూసెక్కులు దిగువకు వదిలారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 31.101 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

2,500 క్యూసెక్కులు..

జూరాల ప్రాజెక్టుకు మంగళవారం ఎగువ నుంచి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు పంపు ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 110, భీమా లిఫ్టు–1 300, లిఫ్టు–2కు 841, ఎడమ కాల్వకు 560 క్యూసెక్కులు కలిపి మొత్తం ప్రాజెక్టు నుంచి 2,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.663 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

లిఫ్టుల ద్వారా 847 క్యూసెక్కులు

రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతుంది. జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులు ఉంది. దీంతో ప్రాజెక్టు పరిధిలోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే వివిధ లిఫ్టుల ద్వారా 847 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంకు నీటి ప్రవాహం..

తొలిసారిగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి జూరాల ద్వారా శ్రీశైలంకు నీటి ప్రవాహం మొదలైంది. జూరాల జలాశయం దాదాపుగా నిండుకోవడంతో అక్కడ విద్యుదుత్పత్తి ప్రారంభించి 7,500 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో బుధవారం 808.2 అడుగుల వద్ద 29.8288 టీఎంసీల నీరు నిల్వ ఉంది. టీఎస్ జెన్‌కో పరిధిలోని భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 6,357 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 15,800 కలిపి మొత్తం 22,157 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జున సాగర్‌కు వదిలారు. అలాగే 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 166 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయగా.. జలాశయంలో 66 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

విద్యుదుత్పత్తి ప్రారంభం

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో బుధవారం విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్‌ల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. అనంతరం జెన్‌కో ఉద్యోగులు స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎగువలో ఒక యూనిట్ ద్వారా 35 మెగావాట్లు, దిగువలో రాత్రి 8 గంటలకు ఒక యూనిట్ ద్వారా 40 మెగావాట్ల విద్యుదుత్పత్తిని విజయవంతంగా చేపట్టారు.


పవర్ హౌజ్ కేంద్రంలో పూజలు చేస్తున్న ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి

జూరాల కుడి కాల్వకు నీటి విడుదల


జూరాల కుడి కాల్వకు నీటి విడుదల అనంతరం పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతులకు వానాకాలం పంట సాగు కోసం నీటిని విడుదల చేశారు. బుధవారం మండల ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో సాగు నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ పంట సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో నీటిని విడుదల చేశారు. రైతులు నీటిని వృథా చేయకుండా పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు పంట సాగు పనులకు శ్రీకారం చుట్టారు. నీటి విడుదలతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. జూరాల ప్రాజెక్టు ఉమ్మడి పాలమూరు జిల్లా అంతటిని సస్యశ్యామలం చేసిన ఘనత ఈ ప్రాజెక్టుకే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్, రైతు బంధు ఇవ్వడంతో పాటు సాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్లను నిర్మించడం జరిగిందని, వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద ప్రారంభం కావడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారన్నారు. నడిగడ్డలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, ఈ కాల్వ నీటితో ధరూరు, గద్వాల, ఇటిక్యాల, మానవపాడు, ఎర్రవల్లి మండలాలకు సాగు నీరందుతుందన్నారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, డీఆర్ విజయ్ కుమార్, కొత్త గణేష్, బషీర్, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రిజర్వాయర్లతోనే శాశ్వత పరిష్కారం

అలంపూర్: ఆర్డీఎస్ రైతుల సమస్యల పరిష్కారానికి రిజర్వాయర్ల నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం లభిస్తోందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని సంపత్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల సమస్య పరిష్కారంపై మంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఆర్డీఎస్ సమస్య శాశ్వత పరిష్కారానికి రిజర్వాయర్ల నిర్మాణం అవసరం ఉందని, తుమ్మిళ్ల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం జరగడంతో దానికి అనుసంధానంగా రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడానికి వీలుగా మల్లమ్మకుంట, జులకల్, వల్లూరు వద్ద రిజర్వాయర్లు నిర్మించి ఆర్డీఎస్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీఎస్ సమస్య పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

సత్యనారాయణస్వామి వ్రతాచరణతో పుణ్యఫలం

నాగర్‌కర్నూల్: శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించిన వారికి పుణ్యఫలం దక్కుతుందని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం ఆయుత చండీ, అతిరుద్రం, శ్రీసీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా బుధవారం కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి వారి అమృత భాషణం, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య 158 మంది దంపతులు సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. అనంతరం 205 మంది దంపతులతో చండీ హోమం నిర్వహించారు. చండీ హోమంలోని సప్తశక్తి అంతరార్థాన్ని వివరించారు. మార్కండేయ పురాణంలోని చండీ హోమ విశిష్టతను తెలియజేశారు. అనంతరం సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాన్ని 15 మంది దంపతులు ఆచరించారు. సాయంత్రం ఎం చండీ మాతకు పంచామృతాలతో అభిషేకం, లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 9వేల మంది పైగా అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీకాళచక్రం లక్ష దీపోత్సవం నిర్వహించారు.


హోమంలో పాల్గొన్న దంపతులు

వనపర్తిలో సినీతార వైష్ణవి చైతన్య సందడి

వనపర్తి: జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన చందన బ్రదర్స్ షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవానికి బేబీ సినిమా హీరోయిన్ వైష్ణవి చైతన్య రావడంతో జనసందడి కనిపించింది. హైదరాబాద్ తరహాలో వస్త్ర, బంగారం, వజ్రాల షాపును ఏర్పాటు చేయడం.. ప్రారంభోత్సవానికి సినీతార రావడంతో స్థానికులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో పాటు మున్సిపల్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.


చందన బ్రదర్స్ షాపింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ హీరోయిన్ వైష్ణవి చైతన్య